క్లుప్తంగా

శ్రీరాముడు ఆదర్శనీయుడు



బలభద్రపురంలో ప్రసంగిస్తున్న ఆత్మ జ్ఞాన ప్రబోధకులు వివేకానంద

బిక్కవోలు: రామాయణం అంటే దైవంతో చేసిన ప్రయాణమని ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఆత్మ జ్ఞాన ప్రబోధకులు వివేకానంద అన్నారు. ఆదివారం మండలంలోని బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక విజయోత్సవ వేడుకలు రెండో రోజు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ సాధారణ మానవుడిగా అవతరించి ఉన్నత వ్యక్తిత్వం, సద్గుణాలతో దైవంగా మారిన మహనీయుడి జీవిత గాథే రామాయణమన్నారు. అందుకే భావి తరాలకు శ్రీరాముడు ఆదర్శనీయుడిగా మారాడన్నారు. రామ తత్వం, ధర్మ మార్గం అనే అంశాలను వివరించారు. వివిధ గ్రామాల నుంచి సాధకులు పాల్గొన్నారు.

నేడు షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం గణపతి పూజ, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు, ప్రత్యేక అలంకరణ, భజన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భారీ అన్నసమారధన ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు బాబాను దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఆదిత్యుడికి ప్రత్యేక పూజలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణ మూర్తి ఆలయంలో స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకట నరసింహాచార్యులు, మరికొంత మంది అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్నారు.

ఫెంగల్ తుపానుతో రైతులకు దడ



కాటవరంలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

సీతానగరం: ఫెంగల్ తుపాను రైతులకు దడ పుట్టిస్తోంది. పండిన పంట చేతికి వచ్చే సమయంలో బెంబేలెత్తిస్తోంది. దీంతో రైతులు వరి కోతలను ఆపేశారు. ఇప్పటికే పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు. తుపాను తీరం దాటి వర్షం కురిసే వాతావరణం కనిపించడంతో కంగారు పడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాతావరణం పొడిగా ఉండటంతో ధాన్యాన్ని ఆరబెట్టారు. మధ్యాహ్నం వాతావరణ మార్పులతో వర్షం కురవడం ప్రారంభమైంది. దీంతో ధాన్యం రాశులపై బరకాలు కప్పారు. కోతలకు వచ్చిన వరిచేలల్లో తుపాను గాలులు వీస్తే వరి దుబ్బులు పడిపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలోని సుమారు 4 ఎకరాల్లో పంట కోతకు సిద్ధంగా ఉంది.

క్రీస్తు ఆగమన పండగ



బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో కొవ్వొత్తులను వెలిగిస్తున్న సంఘ పెద్దలు

మధురపూడి: కోరుకొండ మండలంలో క్రిస్మస్ సందడి మొదలైంది. దీనిలో భాగంగా ఆదివారం క్రీస్తు ఆగమన పండగ నిర్వహించారు. బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో డిసెంబర్ మొదటి రోజు కావడంతో క్రీస్తు జన్మదినోత్సవాన్ని ఆహ్వానిస్తూ కొవ్వొత్తులు వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లూథరన్ క్రైస్తవులు ప్రధాన కూడళ్ల వద్ద స్టార్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చర్చి ఉపదేశి కొల్లి జాకబ్ రాజు, సంఘ పెద్దలు, సుబ్బా రావు, రత్నం, జార్జి, శ్యామల పాల్గొన్నారు.

అనకొండలు

- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- కొండలను తవ్వేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



యర్రంపాలెంలో కొండను తవ్వేస్తున్న మట్టి మాఫియా

రాజానగరం: నియోజకవర్గం పేరు చెప్పగానే ఇసుక మాఫియా ఆధ్వర్యంలో ఇష్టానుసారంగా జరుగుతున్న గోదావరి ఇసుక దోపిడీ గుర్తుకు వస్తుంది. దాని తర్వాత దోపిడీలో మట్టి మాఫియాకు అంతటి పేరు ఉంది. అధికారుల కనుసన్నల్లో యథేచ్ఛగా జరుగుతున్న ఈ దోపిడీతో నియోజకవర్గంలో కొండలు కరిగిపోతున్నాయి. విలువైన మాఫియాకు, వారికి మద్దతుగా నిలిచిన అధికార, అనధికార వ్యక్తులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అక్రమార్కులు అనకొండల మాదిరిగా తయారై ఎర్రమట్టి కొండలను మింగేస్తున్నారు.

ఎర్ర బంగారం

రాజానగరం మండలంలో ఎర్ర మట్టి అపారంగా ఉంటుంది. ఇక్కడ కొండలనే కాదు చెరువులను తవ్వినా ఎర్ర మట్టి వస్తుండటంతో దోపిడీ దారులు దీనిని ఎర్ర బంగారంగా భావిస్తారు. అవకాశం ఉన్న మేరకు ఇప్పటికే చెరువులు ఖాళీ అయిపోగా, ప్రస్తుతం కొండలపై దోపిడీదారులు గురిపెట్టారు. కొండగుంటూరు, సంపత్ నగరం, జి.యర్రంపాలెం, కొత్త తుంగపాడు పరిసరాలలో ఈ ఎర్రమట్టి కొండలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ వీటి ఆనవాళ్లు క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అధికారుల కనుసన్నల్లోనే..

కొందరు అధికారుల కనుసన్నల్లోనే ఎర్ర మట్టి మాఫియా తమ దోపిడీని సాగిస్తోందన్నది జగమెరిగిన విషయం. ఎందుకంటే అధికారంలో ఉన్న వారికి ఎదురునిలిస్తే, బదిలీల వేటు పడటంతో పాటు లేనిపోని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో కొందరు, చేతులు కలిపితే కాసులు దండుకోవచ్చనే ఆశతో మరి కొందరు ఈ దోపిడీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షాల గొంతుకు సమాధానం ఇచ్చేలా మైనింగ్, రెవెన్యూ అధికారులు అధికార పార్టీ మద్దతు దారులైన దోపిడీదారులకు నామ మాత్రంగా అనుమతులిచ్చి, భారీ స్థాయిలో దోచుకునే అవకాశాలను కల్పిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనితో పైప్రాంతాలలో ఉన్న కొండలను అడ్డూ అదుపు లేకుండా, పగలు, రాత్రితో సంబంధం లేకుండా, భారీ యంత్రాలతో తవ్వేస్తున్నా పట్టించుకునేవారు లేరు.

పెరిగిన డిమాండ్

కడియం మండలంలో విస్తారంగా ఉన్న పూల నర్సరీలకు ఎర్ర మట్టి ఎంతో అవసరం. దీనితో అక్కడి వ్యాపారులు ఈ ఎర్రమట్టికి అధిక ధర చెల్లించి మరీ కొనుగోలు చేస్తుంటారు. అందుకనే దీన్ని ఎర్ర బంగారం అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఒక లారీ మట్టికి లోకల్‌గా రూ.నాలుగు వేలు వస్తుంది. అదే కడియం నర్సరీలకు రవాణా చేస్తే రూ.10 వేలు వరకూ ముడుతుంది. అదే ట్రాక్టరు మట్టికి రూ.ఆరు వేలు వరకూ దండుకుంటున్నారు. సుద్దపార లేని ఎర్రమట్టి (గ్రావెల్) లారీకి రూ.15 వేలు వరకు ధర పలుకుతోంది. ఈ కారణంగానే ఎర్రమట్టి కొండలను మాఫీయా ముఠా పిండి చేసి, తమ జేబులు నింపుకొంటోంది.

దోపిడీ ఆగడం లేదు



రాజానగరం మండలంలో జరుగుతున్న మట్టి మాఫియా దోపిడీని అడ్డుకునేందుకు రెండు పర్యాయాలు ప్రయత్నించాం. వారికి అధికారుల అండదండలు ఉండటంతో అర్ధరాత్రి సమయంలో కూడా తరలించుకుపోతున్నారు. ఎర్ర గ్రావెల్ దోపిడీని అధికారులు నిలువరించకపోతే భవిష్యత్తులో అనేక నష్టాలు కలుగుతాయి.

– మండారపు వీర్రాజు,
వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్, శ్రీకృష్ణపట్నం

సత్యసాయి మార్గం.. శ్రేయోదాయకం



భక్తులను సత్కరిస్తున్న రాంబాబు

రంగంపేట: భగవాన్ సత్యసాయి బాబా చేపట్టిన సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని రంగంపేట జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సుభద్రంపేట గ్రామంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ పేపకాయల కాశీశ్వరుడు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన భగవాన్ సత్య సాయి బాబా 99వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ సేవే సర్వేశ్వరుని సేవగా భావిస్తూ సత్య సాయి సేవా సంస్థలు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సీనియర్ భక్తులు పూసల సత్యనారాయణ, మద్దూరి మహారాజులను ఆయన సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. మూడు వేల మందికి పైగా భక్తులు బాబాను దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక సీతారామాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేపకాయల సాయి రామచంద్రరావు, గ్రామ సర్పంచ్ కూటి సాయి తాతారావు, స్థానిక భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలు



జి.మామిడాడలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

పెదపూడి: కార్తిక వన సమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయని పలువురు వక్తలు అన్నారు. అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వన సమారాధనను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో హాజరై అన్నసమారాధనలో పాల్గొన్నారు. జి.మామిడాడ గ్రామం కోనేరు వద్ద పెదపూడి మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముందుగా ఉసిరిచెట్టు వద్ద దామోదర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వన సమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపంలోని తోటలో ఆదివారం భార్గవ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పరస శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణ పూజ, సూర్యనమస్కారాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ సంఘీయుల తరలి వచ్చి ఆటపాటలతో సరదాగా గడిపారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కలిగిస్తున్న నైరా విద్యార్థినులు

రంగంపేట: దాల్వా సీజన్లో వరి విత్తనం, నారు శుద్ధిపై అవగాహన పెంచుకుని అధిక దిగుబడులు సాధించడానికి కృషి చేయాలని నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి.వెంకట్రావు, రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చల్లా వెంకట నరసింహారావు, మానుకొండ శ్రీనివాస్‌లు సూచించారు. మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన శుద్ధి ప్రాధాన్యతా ప్రదర్శన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విత్తన శుద్ధి, నారుమడి తదితర అంశాలపై వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



నినాదాలు చేస్తున్న సీతానగరం పీహెచ్‌సీ సిబ్బంది



సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీ చేస్తున్న వైద్యులు

సీతానగరం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఎస్.రాజు అన్నారు. ఆ ఆస్పత్రి వద్ద ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏవీకే చైతన్య, రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ కండోమ్ ధరించకుండా లైంగిక సంబంధాలు, కలుషిత సూదులు, సిరంజీల వాడకం, ఎయిడ్స్ సోకిన తల్లి నుంచి బిడ్డకు ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. వీటిపై సమాజంలో ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, సూపర్ వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

పెదపూడి: ఎయిడ్స్ వ్యాధిని నివారించి ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి అంతా కృషి చేయాలని సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డి.శ్యామల, శిరీషలు తెలిపారు. సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ రోగుల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారు మనోధైర్యంతో ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.చిన్ని, ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రసాద్, విజయలక్ష్మి, జోగిరాజు, వీరగనిక, వసంతబాల, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదపూడి: ఎయిడ్స్ మహమ్మారి సమాజంలో చాప కింద నీరులా వ్యాపించి యువతను నాశనం చేస్తోందని ఈ వ్యాధిపట్ల ప్రజల్లో చైతన్యం పెరగాలని అనపర్తి జీబీఆర్ నర్సింగ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీవీ.సత్యనారాయణ అన్నారు. ఆదివారం అనపర్తిలో అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేసిన నినాదాలు స్థానికులను ఆలోచింపజేశాయి.



అనపర్తిలో ర్యాలీ చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ రూపొందించిన పారా లీగల్ వలంటీర్స్ పథకం కింద వలంటీర్లుగా ఏడాది కాలం పనిచేసేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు.

కొంకుదురు పీవీకి సత్కారం



ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీని సత్కరిస్తున్న రెడ్డి సంఘీయులు

బిక్కవోలు: కొంకుదురు ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కొంకుదురు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం గ్రామంలోని రెడ్డి సంఘ సభ్యులు నిర్వహించిన సమావేశంలో పీవీ 50వ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలోని ఎన్నో సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘ సభ్యులు తేతలి శ్రీనివాసరెడ్డి, చిన్నం శ్రీనివాసరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి రామచంద్రరెడ్డి, సత్తి అమ్మిరెడ్డి, కర్రి గవాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళలు, కళాకారులతో సంస్కృతికి జీవం



గాత్రకచేరీ చేస్తున్న తులసీ విశ్వనాథ్



నృత్యం చేస్తున్న కళాకారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కళలు, కళాకారులే సంస్కృతికి జీవం పోస్తారని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ అండ్ సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో కృష్ణవేణి సంగీత నీరాజనం (ఇన్ క్రెడిబుల్ ఇండియా) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన జేసీ మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు రాజమహేంద్రవరం నిలయమన్నారు. రాష్ట్రంలోని అరసవల్లి, రాజమహేంద్రవరం, మంగళగిరి, తిరుపతి, అహోబిలంలో ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబరు 6, 7, 8 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కృష్ణవేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం రాజమహేంద్రవరంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విదుషి తులసీ విశ్వనాథ్ గాత్ర కచేరీ ఎంతో ఆకట్టుకుంది. ముందుగా విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, టూరిజం ప్రాంతీయ సంచాలకులు వెంకటాచలం, విజయ శంకర ప్రభుత్వ సంగీతం నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి, ఎన్.శ్రీనివాసరావు, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

పరంజ్యోతి ఆశయసాధనకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాజానగరం: ఆదర్శ కమ్యూనిస్టు పరంజ్యోతి ఆశయ సాధనకు పోరాటాలు ముమ్మరం చేద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పాతతుంగపాడులో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు అధ్యక్షతన ఆదివారం పరంజ్యోతి వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. పీడిత ప్రజల అభ్యున్నతి కోసం పరంజ్యోతి చేసిన పోరాటాన్ని వక్తలు గుర్తు చేస్తూ, అదే ఒరవడితో ప్రయాణం సాగిద్దామన్నారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పి.వెంకటనాయుడు, రైతు కూలీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కారుమబ్బులు.. చిరుజల్లులు



బురదమయంగా మారిన ఏడీబీ రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనాలు



వర్షానికి ఏడీబీ రోడ్డుపై గోతుల్లో చేరిన నీరు

- పలుచోట్ల రోజంతా ఇదే వాతావరణం
- అక్కడక్కడా జోరు వర్షం
- పొగమంచు, చలిగాలులతో అవస్థలు

రంగంపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా ఆకాశం మబ్బులతో ముసుగేసింది. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షపు జల్లులతో రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. శని, ఆదివారాల్లో ఇదే వాతావరణం కొనసాగింది. అనపర్తి నియోజక వర్గంలో అడపాదడపా జల్లులతో రహదారులు చిత్తడిగా మారాయి. ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారు జామున పొగమంచు, ఉదయం చలి గాలులతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

పొగమంచుతో అవస్థలు

పొగమంచు కారణంగా రహదారులపై వాహనదారుల ప్రయాణం కష్టతరంగా మారింది. ఏమాత్రం అలసత్వం వహించినా ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. అసలే గోతులతో నిండిన ఏడీబీ రోడ్డులో పొగమంచుతో ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది.

వణికిస్తున్న చలిపులి

తుఫాన్ ప్రభావంతో వర్షంతో పాటు చలిగాలుల ప్రభావం ఎక్కువైంది. నవంబర్ నెల ప్రారంభం నుంచే మంచు కురుస్తూ చలి తీవ్రత ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చల్ల గాలులు వీయడంతో చలి తీవ్రత అధికమైంది. వృద్ధులు, చిన్నారులు చలికి గజగజ వణుకుతున్నారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎస్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామ్ ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609
విద్యుత్ శాఖ ఇంజినీర్, రాజానగరం	సుధాకర్	94408 12623
విద్యుత్ శాఖ ఇంజినీర్, సంపత్ నగరం	సత్యప్రసాద్	94408 12627
మండల విద్యాశాఖాధికారి- 1	రామన్నదొర	94409 13928
మండల విద్యాశాఖాధికారి- 2	జ్యోతిప్రసాద్	94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సీడీపీఓ	టి.నాగమణి	94408 14693
ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఏపీఎం	సునీత	79933 25065
గృహ నిర్మాణ శాఖ డీఈ	ఆర్‌వీ బాబు	70939 30566
గృహనిర్మాణ శాఖ ఏఈ	ఏవి రామారావు	70939 30478
సబ్ రిజిస్ట్రార్, రాజానగరం	వెంకటేశ్వరరావు	70939 21434
పోలీసు శాఖ		
రాజానగరం సీఐ	ఎస్‌పీ వీరయ్య గౌడ్	94407 96585
రాజానగరం ఎస్సై- 1	మనోహర్	94932 06031
ఎస్సై- 2	నాగేశ్వర్	94904 91132
బొమ్మూరు సీఐ	కాశీ విశ్వనాథ్	94407 96533